

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,18 ఆగస్టు 2025 | 8 పేజీలు

## మసకబారుతున్న...



# ఆత్రేయపురం పూతరేకుల ప్రతిష్ట

### విచ్చలవిడిగా కల్తీ నెయ్యి వినియోగం..!






- ఆటోల్లో ఆగని కల్తీ నెయ్యి విక్రయాలు
- నెల నెల మామూళ్లతో బరితెగిస్తున్న కల్తీ దొంగలు
- పోతే ప్రజలే పోతారు మనకేంటి అనుకుంటున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు...
- గట్టి తనిఖీలతో ఆత్రేయపురం పూతరేకుల ప్రతిష్ట పెంచాలని ప్రజల విజ్ఞప్తి



కాకినాడ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి.శ్రీనివాస్ సాధారణ బదిలీల్లో భాగంగా కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లడం విశాఖ జిల్లాకు చెందిన ఎసిఫ్ అధికారి నందాజీ ఇక్కడ బాధ్యతలు చేపట్టడం ఈ మారిన పరిస్థితుల్లో ఆత్రేయపురంలో కొందరు కల్తీ నెయ్యి పూతరేకుల వ్యాపారులకు పండగగా మారింది. ఇప్పుడు ఉన్న ఫుడ్ సేఫ్టీ అధికారులు కల్తీ నెయ్యి విక్రయ కేటుగాళ్లతో చేతులు కలిపి ఉత్తుత్తి దాడులతో, అసలు దాడులే లేకుండా కల్తీ నెయ్యి కేటుగాళ్లకు సహకరిస్తూ డబ్బులు దండుకోవడంతో ఆత్రేయపురం పూతరేకుల కల్తీ నెయ్యి వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. చిన్న పెద్ద ముసలి ముతక తేడా లేకుండా అందరికీ నోరూరించే పూతరేకులకు ప్రసిద్ధిగాంచిన కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో పూతరేకుల్లో కల్తీ నెయ్యి వినియోగం అడ్డు అదుపు లేకుండా సాగిపోతుంది. ఘుమ.. ఘుమ లాడే నెయ్యిలో కేటుగాళ్ళ పశువుల ఎముకలు, క్రొవ్వుతో తయారు చేసిన కల్తీ నెయ్యి వాడి...అసలు సిసలైన నాణ్యమైన నేతి పుతరేకుల్లా గుట్టు చప్పుడు కాకుండా వినియోగదారులు అధికధరలకు అమ్ముతూవారిఆరోగ్యంతో చెలగాటలాడుతున్నారు.ఆత్రేయపురం పుతారేకుల ప్రతిష్టకు,ప్రజల ఆరోగ్యానికి సవాల్ విసురుతున్న కల్తీ నెయ్యి దొంగలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ఆహార భద్రత అధికారులు నిత్యం నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :

కోనసీమ జిల్లా ఆత్రేయపురం పరిసరప్రాంతాల్లో వందల సంఖ్యలో వ్యాపారులు స్వచ్ఛమైన నేతి పూత రేకుల్ని తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నోట్లో పెట్టుకోగానే పెట్టే కరిగి పోయి.. కమ్మనైన రుచిని పంచే ఆత్రేయపురం పూతరేకులకు కల్తీ నెయ్యిదొంగల అత్యాశతో వినియోగదారుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. కొందరు వ్యాపారులు నిక్కర్సైన నెయ్యితో ఆత్రేయపురం పూతరేకులు తయారుచేస్తూ జాతీయస్థాయిలో ఆత్రేయపురం పూతరేకులకు ఒకపేరు ప్రఖ్యాతులు తెస్తుంటే... ఆపేరును అడ్డుపెట్టుకుని కొందరు

- తరువాయి 2లో..



# ఐటీ మంత్రి లోకేష్‌కి భారీ స్వాగతం...

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** రాజమండ్రి రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య వారి నేతృత్వంలో కడియం మండలం నుండి వచ్చిన రైతులు 250 మంది,100 ట్రాక్టర్లతో ర్యాలీ రాజమండ్రి ఆర్టీసీ కాంప్లెక్సు రహదారి మార్గం మీదుగా, మోరంపూడి సెంటర్ కు వచ్చి అక్కడ నుండి జాతీయ రహదారి మీదుగా బొమ్మూరు సెంటర్‌కు వెళ్లడం

- తరువాయి 2లో..

# మహిళల స్వయం ఉపాధికి, ఆర్థిక పరిపుష్టికి కృషి

- సీఎం అడుగుజాడల్లోనే సామాజిక సేవా కార్యక్రమాలు
- వృత్తి నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** మహిళలు వృత్తి నైపుణ్య శిక్షణలు తీసుకోవడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, తద్వారా వారి కాళ్లపై వారు నిలబడ్డామనే ఆత్మవిశ్వాసం కలుగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు గృహ సంబంధ ఉత్పత్తుల తయారీ పై నాలుగు రోజులపాటు ఇచ్చే ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం రామచంద్రపురంలోని వి ఎస్ ఎం కళాశాలలో మంత్రి ప్రారంభించారు. అనంతరం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయం మేరకు ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంగా, ఏటా లక్ష 75 వేల మంది మహిళ పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దీపం పథకం, తల్లికి వందనం, స్త్రీ శక్తి - ఉచిత బస్సు పథకం విజయవంతంగా అమలు చేశామన్నారు. వృత్తి విద్య కోర్సులు నేర్చుకుని స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని సూచించారు. మహిళలు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కలగజేస్తామన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేసేందుకు పలు జాబ్ మేళాల నిర్వహణతో పాటు, మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగ్ తయారు తదితర శిక్షణలు ఇచ్చి వారి స్వయం ఉపాధికి ఊత మిస్తున్నామన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు(ఎం ఎస్ ఎం ఈ) స్థాపనలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. చిన్నవయసులోనే భర్తలను కోల్పోయి బతుకు భారంతో ఉన్న వితంతువులకు

- తరువాయి 2లో..

# జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం

**– జగ్గంపేటలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఏపీయూడబ్ల్యూజే 68వ ఆవిర్భావ దినోత్సవం జగ్గంపేటలో ఆదివారం ఘనంగా జరిగింది. జగ్గంపేట నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి చింతల రాంబాబు ఆధ్వర్యంలో నాలుగు మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు. ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు పెనుగాడి సత్య సూర్యనారాయణ, ఏపీడబ్ల్యూజే అనుబంధ సంస్థ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి చిక్కాల మణికంఠ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభ్యుల హర్షధ్వానాల నడుమ చిక్కాల మణికంఠ జెండా ఆవిష్కరించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో స్వీట్లు పంచి పండగ వాతావరణం తలపించారు. సీనియర్ ప్రసంగిస్తూ ఏపీడబ్ల్యూజే సుదీర్ఘకాలంగా జర్నలిస్టుల పక్షపతిగా ఎన్నో సమస్యలు పరిష్కారంకు కృషి చేసిందన్నారు. ఐజేయుకు అనుబంధ సంస్థగా నిబద్ధతతో విలేకరుల కష్టాల్లో అండగా నిలుస్తుందని తెలిపారు. గత పోరాటాల్లో అక్రిడేషన్ విషయంలో గాని, విలేకరుల హక్కుల సాధనలో గాని ఏపీయూడబ్ల్యూజే రాజీలేని పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు పెనుగాడి సూరిబాబు, రాయుడు బాబ్జి, చింతల రాంబాబు,నేదూరి శ్రీధర్,సుంకర శ్రీను, శేఖర్, వల్లభశెట్టి శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగ ప్రతినిధి రమ్య, డి2 నాని, మధు, బాబి, అరుణ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో కార్పొరేషన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**– కమిషనర్ భావన**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ కమిషనర్ భావన ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం కమిషనర్ భావన ఒక ప్రకటన విడుదల చేశారు. రానున్న రెండు రోజుల పాటు కాకినాడ లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చాలా ఏళ్ళు క్రితం నిర్మించి శిథిలవస్థకు సిద్ధంగా ఉన్న భవనాలకు ప్రజలు దూరంగా ఉండాలని కమిషనర్ భావన ఐఏఎస్ తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా కాకినాడ కార్పొరేషన్ లో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని కమిషనర్ భావన ఐఏఎస్ తెలిపారు. వర్షాల వలన ఎటువంటి ఇబ్బంది ఏర్పడినా రోడ్లు తెగినా, చెట్లు కూలినా, ట్రాఫిక్ ఇబ్బంది కలిగినా టోల్ ఫ్రీ నెంబర్, టోల్ ఫ్రీ నెంబర్ 18004255990 కంట్రోల్ రూమ్‌లో ఉన్న సిబ్బంది ఫోన్ చేసి వెంటనే సమాచారం తెలియజేయాలన్నారు.

–భారీ వర్షాలు కారణంగా పిజిఆర్ఎస్ రద్దు

వచ్చే రెండు రోజులు కాకినాడలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఈనెల 18 వ తేదీ సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ను రద్దు చేయడం జరిగిందని కార్పొరేషన్ కమిషనర్ భావన ఐఏఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.

# నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు

**పెంటపాడు, మేజర్‌న్యూస్:** పెంటపాడు మండలం వల్లూరుపల్లి దర్శపర్రు బోడపాడు కే పెంటపాడు మాంజిపాడు యానాలపల్లి పడమర విప్పరు, పరిమళ ప్రాంతాలలో కొద్ది రోజుల క్రితం విస్తారంగా కురిసిన వర్షాల వల్ల పంట పొలాలు నీటి మునిగాయి. వీటిని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాసు అధికార యంత్రాంగంతో వెళ్లి రైతులను పరామర్శించారు. గడిచిన నాలుగు రోజులుగా నీట మునిగిన పంట కుళ్ళిపోయిందని ఇప్పుడు మరో పంట వేసే అవకాశం లేకపోయిందని రైతులు వాపోయారు.

ఈ క్రమంలో మరో నాలుగు రోజులు పాటు వర్షాలు ఉన్న కారణంగా మరో పంట వేసేందుకు అవకాశం లేని కారణంగా పెంటపాడు మండలానికి చెంది సుమారు 7300 ఎకరాల పంట నష్టాన్ని ఉన్నతాధికారులకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు తెలియజేస్తానని బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఎకరానికి 210 రూపాయలు భీమా చేసుకుంటే ధైర్యంగా ఇంట్లో పడుకునే పరిస్థితి, కష్టం వచ్చినప్పుడు బాధపడే కంటే భీమాచేసుకుని ఉండాలి అని సూచించారు. మన ప్రాంత అభివృద్ధి కోసం అవసరమైతే చందాలు వేసుకొని అయినా సరే అభివృద్ధి చేద్దామని సూచించారు. మున్సిపాలిటీలో నిధులు లేవు, పంచాయతీలో నిధులు లేవు, మార్కెట్ యార్డులో నిధులు లేవు చంద్రబాబు నాయుడు చాకచక్యంగా పరిపాలన చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం వల్ల పంటలు నీట మునుగుతున్నాయని మొరుగుబోతులను పరిశుభ్రం చేసుకోవాల్సిన అవసరం ఆవశ్యకత మనకుందాన్ని సూచించారు.

వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ 13వ తేదీ స్వల్ప సమయంలో 13 సెంటీమీటర్ల వర్షం కురవడం 7,300 ఎకరాల పంట నీట మునిగిందని, అది నేటికీ మనకు లోనే ఉండడంతో పంట మొత్తం దెబ్బతిన్నదని తెలియజేశారు. మార్టేరు వ్యవసాయ క్షేత్రం నుండి సైంటిస్టులను పిలిపించి వారి సూచన మేరకు తదుపరి చర్యలు తీసుకుందామని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కిలపర్తి వెంకటరావు, పసల కొండ, పుల్లా బాబి, వ్యవసాయ అధికారులు, ఎమ్మార్వో ఎండిఓ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలి

**ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, కాపు కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు**

**నర్సాపురం రూరల్, మేజర్‌న్యూస్:** రైతు సంక్షేమమే ధ్యేయంగా చైర్మన్‌లు పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడులు అన్నారు. ఆదివారం మండలంలోని కొప్పర్రు ప్రాథమిక సహకార చైర్మన్‌గా అందే నరేన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా సొసైటీ ప్రాంగణంలో జరిగిన సభలో వీరు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వం అందిస్తున్న సాయం రైతులకు అందేలా నూతన కమిటీలు కృషి చేయాలన్నారు. ఆధునిక యంత్రాలతో వ్యవసాయం చేసి రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేలా చూడాలన్నారు. పదవులు పొందిన వారు చిన్నవా, పెద్దవా అని కాకుండా అంకితభావంతో పనిచేస్తే ఉన్నత స్థితికి ఎదగడానికి దోహద పడతాయన్నారు. కొప్పర్రు సొసైటీ మాజీ అధ్యక్షుడు, గ్రామ పెద్ద అందే పిచ్చయ్య వంటి నాయకులను కొత్తగా పదవి బాధ్యతలు చేపట్టిన వారు ఆదర్శంగా తీసుకుని పని చేయాలన్నారు. డి సి ఎం ఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు కొత్తపల్లి జానకిరామ్, బందారు మాధవ నాయుడు, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు తదితరులు మాట్లాడారు. పీఏసిఎస్ చైర్మన్‌గా నరేన్, డైరెక్టర్స్ గా కడలి మసేనురావు, మెరుగుముువ్వల భాస్కర రామస్వామిలు ప్రమాణస్వీకారం చేశారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్లి వరలక్ష్మీ జేమ్స్, ఉప సర్పంచ్ అందే కవి కుమార్, ఎంపీటీసీ పత్తి లక్ష్మీ సంపూర్ణ, సొసైటీ కార్యదర్శి దొడ్డ లక్ష్మణరావు, గ్రామ పెద్దలు పోలిశెట్టి మధు, ముక్కు బాబూరావు, బాపూజీ, పిప్పళ్ల సత్యశ్రీ, అందే అమర్, యాదంరెడ్డి సూరిబాబు, తిరుమాని ఏడుకొండలు, బులి సత్యం, చింతపల్లి శ్రీనివాస్, నళిని పోలిశెట్టి, అరుణ అంబటి తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మసకబారుతున్న... ఆత్రేయపురం పూతరేకుల ప్రతిష్ట

మొదటిపేజి తరువాయి

దొంగ వ్యాపారస్తులు కల్తీ నెయ్యితో చెలరేగిపోయి పూతరేకులు తయారు చేస్తూ ఆత్రేయపురం పేరుతో అమ్మకాలు సాగిస్తూ యదేచ్ఛగా దందా సాగిస్తారు. ఇటువంటి దొంగలను గడిచిన సంవత్సరకాలంలో గత కాకినాడ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి శ్రీనివాస్ మెరుపు దాడులతో దొంగల వెన్నులో ఒణుకు పుట్టించారు. 15 మంది వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేశారు. సాధారణ బదిలీలో భాగంగా ఆయన కృష్ణా జిల్లా వెళ్లిపోవడంతో.. దొంగ వ్యాపారులకు పండగగా మారింది. కాసులు వెదజల్లి అక్రమాలకు తెగబడ్డారు.తక్కువ ధరకే వస్తుందని కల్తీ నెయ్యిని పుతారేకుల్లో ఉపయోగించడంతో పలువురు అనారోగ్య బారిన పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడపా దడపా దాడులు జరపటమే తప్ప పూర్తిస్థాయిలో కల్తీ నెయ్యి వాడకాన్ని అరికట్టడంలో అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో కల్తీ దందా యథేచ్ఛగా సాగుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆత్రేయపురం బస్టాండ్ సెంటర్, ధనరాజు మలుపు, కుమ్మరిగూడెం, స్టేట్ బ్యాంక్ పరిసర ప్రాంతాలతో పాటు ఆత్రేయపురం, ఉచ్చిలి, కట్టుంగ బొబ్బర్లంక, తదితర గ్రామాల్లో కల్తీ నేయ్యిని విచ్చలవిడిగా పూతరేకుల తయారీలో వాడుతున్నారు. నిడదవోలు, రాజమండ్రి, తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల నుండి ఆటోల ద్వారా రాత్రి సమయాల్లో కల్తీ నెయ్యిని తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తు ఉండడంతో కల్తీ నెయ్యి కోరలు చాపుతుంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించి కల్తీ నెయ్యిగా నిర్ధారించి కేసులు నమోదు చేసిన కల్తీ గాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట పడక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్న కల్తీ కేటుగాళ్ళకు శిక్షలు పడకుండా నామ మాత్రపు కేసులతో ఫుడ్ సేఫ్ట్ అధికారులు సరిపెట్టడం తోనే ఈ దందాకు అడ్డుకట్ట పడటం లేదనే ఆరోపణలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి. నెలవారీమామూళ్ళు చేతులు మారుతుండడం తోనే కల్తీ నెయ్యి విక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. గతంలో ఆత్రేయపురంలో నాలుగు షాపుల్లో 880 కేజీల కల్తీ నెయ్యి విక్రయాలు చేస్తుండగా దాడులు చేసి సిజే చేసిన చేసుకున్న ఫుడ్ సేఫ్టీ అదికారులు ఇప్పుడు వారిపై నామమాత్రపు కేసులు పెట్టడం వలనే ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో కల్తీ నెయ్యి ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదని పలువురు చర్చించుకుం టున్నారు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆత్రేయపురం పరిసరప్రాంతాల్లో పూతరేకుల్లో వినియోగిస్తున్న కల్తీ నెయ్యి వాడకాన్ని పూర్తిస్థాయిలో అరికట్టి చట్ట ప్రకారం కఠిన నిర్ణయాలు తీసుకోని.. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

## ఐటీ మంత్రి లోకేష్‌కి భారీ స్వాగతం...

మొదటిపేజి తరువాయి

జరిగింది. ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ &కమ్యూనికేషన్ మరియు ఆర్‌టీజి శాఖల మంత్రివర్యులు నారా లోకేష్ ఆదివారం మధ్యాహ్నం పాలకొల్లు నుంచి రోడ్డు మార్గంలో మధురపూడి విమానాశ్రయానికి వెళుతున్న సందర్భంలో జాతీయ రహదారిపై శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మరియు కార్యకర్తలకు అభివాదం చేసి, అనంతరం మంత్రిలోకేష్ విమానా శ్రయానికి వెళ్లడం జరిగింది.

## మహిళల స్వయం ఉపాధికి, ఆర్థిక పరిపుష్టికి కృషి

మొదటిపేజి తరువాయి

చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఎం ఎస్ ఎం ఈ ద్వారా, ముద్ర రుణాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి కోసం వివిధ రకాల సబ్బులు, షాంపూలు, లోషన్లు, టూత్ పేస్టులు, లిప్ బామ్‌లు తదితర వాటిపై శిక్షణ ఇచ్చేందుకు బెంగళూరు నుంచి నిపుణులను తీసుకొచ్చామన్నారు. ఈనెల 20 వరకు శిక్షణ ఇస్తామని వెల్లడించారు. త్వరలోనే సెల్ ఫోన్ల రిపేర్, అగరబత్తీల తయారీ శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. మంత్రి సుభాష్ గారి సహకారంతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. మహిళల పట్ల సామాజిక బాధ్యతగా పలు శిక్షణ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మంత్రి సుభాష్‌కు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలకు శిక్షణ ఇచ్చే నిపుణురాలు ప్రియా జైన్ ( బెంగళూరు ) ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు వుండవిల్లి శివ,కంచుమర్తి బాబురావు పాల్గొన్నారు.

# శ్రీ వరలక్ష్మీ వ్రత ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో దుర్గాడ రామారావు దంపతులకు సన్మానం




పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ : పెద్దాపురం మండలం దివిలి గ్రామంలో శ్రీ కటకం అన్నబ్బాయి గారి రైస్‌మిల్ వద్ద శ్రీ వరలక్ష్మీదేవి ఉత్సవ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేది ప్రారంభమై 15వ తేది వరకు పరిషత్ భజన పోటీలు శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు మరియు శ్రీ వరలక్ష్మీ దేవి ఉత్సవ కమిటి సభ్యులు బండారు మంగబాబు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ భజన కళాకారులు తొలి తిరుపతి గ్రామానికి చెందిన దుర్గాడ శ్రీరాములుఅనేరామారావు, నూకరాజు దంపతులను శ్రీ వరలక్ష్మీదేవి ఉత్సవ కమిటి సభ్యులు, శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త కటకం శ్రీరామమూర్తి, శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పోతుల వీరన్న చౌదరి, సంఘం జాయింట్ సెక్రటరీ పచ్చిపాల ప్రసాదరావులు మాట్లాడుతూ చిరుప్రాయం నుండి సుమారు 85 సం.ల వయసులో కూడా యువకులతో పోటాపోటీగా భజన గీతాలు ఆలపించడంలో రామారావు ఎంతో చురుకుగా ముందుంటారని, ఎక్కడ భజన ఉన్నా పిలవగానే వచ్చి ఆయన గాత్రంలో మంచి మంచి కీర్తనలు ఆలపించి భక్తులను రంజిపచేస్తారని, అటువంటి పుణ్యదంపతులకు ఈ రోజు శ్రీ వరలక్ష్మీ దేవి వ్రత మహోత్సవాలలో భాగంగా సన్మానించడం మనకెంతగానో అదృష్టమని, ఈ అవకాశం కల్పించిన బండారు మంగబాబుకు మరోసారి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవిశేఖర నీలం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఇనుగంటి రామకృష్ణ, గౌరవాధ్యక్షులు మావిరెడ్డి నెహ్రూ, గడపా శివబాబు, పంచాది రామకృష్ణ, సంఘ వ్యవస్థాపకులు ఎలిశెట్టి కామరాజు, కురుమెళ్ళ దొరబాబు, కామన స్వామి, పోతిరెడ్డి బుజ్జి, రాధాకృష్ణ మహిళా భజన సమాజం సభ్యులు, గ్రామ నాయకులు, భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితులకు వెంటనే పరిహారం అందించాలి

– సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవిఎస్




రంపచోడవరం, మేజర్ న్యూస్ : పోలవరం నిర్వాసితులకు వెంటనే పరిహారం ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి ఎస్ డిమాండ్ చేసారు. సిపిఐ అల్లూరి జిల్లా మహా సభ రెండో రోజు ఆదివారం స్థానిక ఆర్ పి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. సిపిఐ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సిపిఐ అనుబంధ సంఘాల నాయకులు పలు సమస్యలపై తీర్మానాలు మహాసభలో ప్రవేశ పెట్టారు. ముందుగా పార్టీ జెండా ను రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి ఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభ ను ఉద్దేశించి రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం పాటు పడాలని సూచించారు. ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే సిపిఐ పార్టీ పని చేస్తుందని, పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంతో నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. జిల్లా కార్యదర్శి పొట్టిక సత్య నారాయణ మాట్లాడుతూ సభ్యులు ప్రవేశ పెట్టిన తీర్మానాలపై చర్చించి నిర్ణయాలు తీసుకొంటామన్నారు. గత రెండు రోజులుగా సుదూర ప్రాంతాల నుండి వచ్చిన పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ప్రసాద్, రంపచోడవరం డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్, మహిళా నాయకురాలు దుర్గ, మండల కార్యదర్శులు, పార్టీ నాయకులు ఇరవాడ దేవుడు, కందుకూరు స్వర్ణ, ఉల్లి సత్యనారాయణ, పోతురాజు, సింహాచలం, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాల కూల్చివేతలో చిత్తశుద్ధి ఏది?

– మండిపడుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్



రంపచోడవరం, మేజర్ న్యూస్ : మీరు కూల్చుకోండి, మేము మళ్లీ కట్టుకుంటూనే ఉంటామంటూ అధికారులు అండదండలతో నాన్ ట్రైబల్స్ (కొంతమంది) మళ్లీ రెచ్చిపోతున్నారని ఏజెన్సీ ప్రాంతంలో అధికారులు నిర్లక్ష్యంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మండిపడ్డారు. ఏజెన్సీలో అక్రమ కట్టడాల కూల్చివేత పై అధికారుల్లో చిత్తశుద్ధి మసక బారిపోయిందని, దీనివల్ల ఇప్పటికే తొలగించిన అక్రమ కట్టడాలు ప్రదేశాల్లో కొంతమంది నాన్ ట్రైబల్స్ మళ్లీ పెట్రేగిపోయి స్థానిక అధికారులకు ముడుపులు ఇస్తూ మరలా అక్రమ కట్టడాలు చేపడుతున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అధికారులపై మండిపడ్డారు. ఆదివారం నాడు ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో కుంజా శ్రీను మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యధోరణి వల్ల కొంతమంది నాన్ ట్రైబల్స్ అక్రమంగా విచ్చలవిడిగా మళ్లీ అక్రమ నిర్మాణాలు మొదలుపెట్టారని ఆయన ఆరోపించారు. గిరిజన ప్రాంతంలో అక్రమ కట్టడాలు తొలగింపు ఆగలేదని, జిల్లా కలెక్టర్ మాటలు ఉత్తిదే అని దీన్నిబట్టి అర్థమవుతుందని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ అధికారులు, సబ్ కలెక్టర్ అందరూ ఆక్రమణల పై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి అధికారులు నాన్ ట్రైబల్స్‌కు అమ్ముడుపోయి అక్రమ కట్టడాలు మళ్లీ పునర్నిర్మాణం చేయటానికి ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, చర్యలు తీసుకుంటామని చెప్పి ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. ప్రజా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు వాటిపై దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోకపోతే ఇక కిందిస్థాయి అధికారులు ఎందుకు పట్టించుకుంటారని, నిర్లక్ష్యం వహిస్తున్న స్థానిక అధికారులపై రెవెన్యూ, పంచాయతీ, ఆర్ అండ్ బి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయం లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఒక్క అధికారి నైనా సస్పెండ్ చేస్తే అప్పుడు కిందిస్థాయి అధికారులు అక్రమ కట్టడాలను ప్రోత్సహించకుండా ఉంటారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులకు ఏజెన్సీలో పనిచేసే హక్కు లేదని, ఆదివాసి హక్కులు నీరుగారి పోతున్నా, ఆదివాసి చట్టాలను నాన్ ట్రైబల్స్ తుంగలో తొక్కుతున్నా వారికి వత్తాసు పలుకుతూ జేబులు నింపుకుంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయగలిగే నిజాయితీ ఐఏఎస్ ఆఫీసర్లను ఏజెన్సీ ప్రాంతాలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కుంజా శ్రీను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ కుమార్ దొర, డివిజన్ కోఆర్డినేటర్ పీట ప్రసాద్, నాయకులు కంగాల అబ్బాయి దొర, చోడి ఏడుకొండలరావు దొర, ప్రసాద్ దొర తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న అన్నదాన భవన నిర్మాణానికి రూ లక్ష విరాళం



ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి వకులమాత అన్నదాన భవన నిర్మాణానికి కైకలూరు జిల్లా భైరవపట్నంకు చెందిన గాదిరాజు నారాయణరాజు అరుణ దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు రూ 1,01,116 లు విరాళంగా సమర్పించారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు దాతలకు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు కూటమి నాయకులు కాబోయే చైర్మన్ ముదునూరి వెంకటరాజు స్వామివారి చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు ఉన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

– పాల్గొన్న భక్తులు



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## శోభాయమానంగా మదన గోపాలస్వామి వారి కళ్యాణం



అనపర్తి, మేజర్ న్యూస్ : మండలంలోని, ప్రముఖ వైష్ణవ క్షేత్రముగా ప్రసిద్ధిగాంచిన పొలమూరు గ్రామంలోని రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో శాంతి కళ్యాణం వేడుకగా జరిపారు. వైఖానస ఆగమ విధానంలో వేదపండితులు వాడపల్లి వేణుగోపాలచార్యులు స్వామికి శాంతికర కళ్యాణం జరిపించారు. రామవరం గ్రామానికి చెందిన సత్తి చిన వెంకటరెడ్డి శ్రీమతి దేవి మానస దంపతులు కళ్యాణ కర్తలుగా వ్యవహరించారు. అనంతరం వైష్ణవ శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని చిన్నారులు రాధా కృష్ణ వేశాధారణలతో కనువిందు చేశారు.

చిన్నారులు ఆలపించిన భగవద్గీత శ్లోకాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త కొవ్వూరి రామకృష్ణారెడ్డి చిన్నారులకు బహుమతులు అందించారు. అనంతరం గోవింద నామాలు, భజన, భక్తులు కు ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆలయ అర్చకులు వంశీ కృష్ణ, ఈవో శివ రామకృష్ణ, సత్తి గౌరీలక్ష్మి, పడాల చెల్లా భవాని, కుమారి, నల్లమిల్లి లక్ష్మి సౌజన్య, మేడపాటి రామారెడ్డి, సత్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎవి.నగరంకి సమస్యలు వెల్లువ

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- ఎవి.నగరంకి అనారోగ్యం



**తొండంగి, మేజర్ న్యూస్ :** ఏవి నగరంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి మండల పరిధిలోగల గ్రామాల నుండి ఆరోగ్యం నిమిత్తం అనారోగ్యంతో వెళ్ళేవారితో ఆసుపత్రి సిబ్బంది ఆటలాడుకుంటున్నారు. జ్వరం ఉందని వెళ్లే పేషెంట్లకు ఎటువంటి పరీక్షలు టెస్టులు చేయకుండా కాకినాడ ఎటువంటి రిఫరెన్స్ లెటర్ లేకుండా సిఫార్సు చేస్తున్నారు. తొండంగి మండలం సీతారామపురం గ్రామం నుండి దేవిశెట్టి అనంతలక్ష్మి మూడు రోజుల నుండి జ్వరంగా ఉందని మంగళవారం ఉదయం 10:30 నిమిషాలకు ఆసుపత్రికి వెళ్లి డాక్టర్ తో చెప్పగా డాక్టర్ ఎటువంటి పరీక్షలు చేయకుండా నీకు గుండెకి సంబంధించిన వ్యాధి ఉందని కాకినాడ హాస్పిటల్ కి వెళ్లాలని సూచించారు. రిఫరెన్స్ లెటర్ రాయకుండా పంపించడం ఇందులో మర్మం ఏమిటో కాకినాడ తీసుకెళ్లి అక్కడ అన్ని పరీక్షలు చేయించగా ఆవిడకి ఎటువంటి గుండె సమస్య లేదని డాక్టర్లు తెలిపారు. రక్త పరీక్షలో మాత్రం డెంగ్యూ జ్వరం అని తెలిపారు. ఎ వి నగరం ఆసుపత్రిలో డాక్టర్లు నిర్లక్ష్యం కారణంగా ఆమె గుండె జబ్బు ఉందనుకొని బయపడింది.మండల పరిధి గ్రామాల్లో పేషెంట్లు చాలా ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల నుండి జ్వరంగా ఉన్న నీరసంగా ఉన్న పేషెంట్లు ఏవి నగరం ఆసుపత్రికి వెళ్ళగా అక్కడ ఉన్న డాక్టర్లు వాళ్లని పరీక్షించకుండా కాకినాడ వెళ్లండి సిఫార్సు చేస్తున్నారు. అసలు వెళ్లిన పేషెంట్లను చూసి పరీక్షించి వాళ్లకి పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేయవలసిన డాక్టర్లు అలసత్వం వహించి కాకినాడ తరలిస్తున్నారు. ఇకనైనా అధికారులు పట్టించుకుని వాళ్లపై చర్య తీసుకోవాలని తొండంగి మండలం పరిధిలోగల గ్రామాల ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.అయితే ఇక్కడున్న డాక్టర్ లకు వారి ప్రైవేట్ క్లినిక్ మీద ఉన్నా ప్రేమ వారికీ జీతాలు ఇచ్చే గవర్నమెంట్ హాస్పిటల్ మీద లేదని పలువురు అంటున్నారు. ఈ బాధలు భరించలేక దగ్గర్లోని రిపరల్ హాస్పిటల్ లేదా తుని ప్రైవేట్ హాస్పిటల్ కి పెషేంట్ లు వెళ్లిపోతున్నారు.అయితే వీరు కాకినాడ ప్రైవేట్ హాస్పిటల్ కీ పి ఆర్ ఓ లాగా పనిచేస్తున్నట్లు వినికిడి. ఇప్పటికైనా స్థానిక ఎంఎల్ ఏ అధికారులు ఈ హాస్పిటల్ని పట్టించుకొని పేదల ఆరోగ్యం పై దయ చూపిస్తారని కోరుతున్నారు.

# విజయవాడలో భారీ బిజెపి బహిరంగ సభకు తరలి రండి

- బిజెపి జిల్లా అధ్యక్షుడు పిలుపు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఓబీసీ మోర్చా విజయవాడలో ఏర్పాటు చేస్తున్నటువంటి సంచార అర్ధ సంచార విముక్త జాతుల విముక్తి దినోత్సవం భారీ బహిరంగ సభ కోసం బిజెపి కాకినాడ జిల్లా కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చ శివ ప్రసాద్ పాల్గొని విజయవాడలో జరుగు భారీ బహిరంగ సభకి సంచార జాతుల విముక్తి దినోత్సవం కార్యక్రమం కోసం వివరించారు. సంచార జాతులు వారు సంస్కృతి వారదులని వారి అభివృద్ధి కొరకు పిలుపు నిచ్చే ఈ భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని తెలియజేసారు. అనంతరం బిక్కిన విశ్వేశ్వరరావు గారి చేతుల మీదుగా ఓబీసీ మోర్చా నాయకులందరూ కలిసి కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు , మోర్చా నాయకులు తామరపల్లి దుర్గా ప్రసాద్ , బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కుండల సాయి, బిజెపి జిల్లా కార్యదర్శి మేడ విజయలక్ష్మి ,బిజెపి నాయకులు దొడ్డి వీరేంద్ర, కొండేటి గంగాధర్, ఘంటసాల గోవిందరాజులు, మెడ పరమేశ్వర రావు, ఘంటసాల నాగరాజు , చోడిశెట్టి రమేష్, జ్యోతుల రాజేష్, పెండం శ్రీదేవి, గూటూరి పద్మ, యార్లగడ్డ రామ్ కుమార్, పైడా రవీంద్ర, యువమోర్చ నాయకులు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో ఆధునిక క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం

- వైడి.రామారావు వెల్లడి




**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడలో క్యాన్సర్ నివారణకు అత్యంత ఆధునిక ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ కృషి చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు వైడి రామారావు అన్నారు ఆదివారం స్థానిక నాగార్జున రోడ్డులోని సత్క ళావాహిని భవనములో జరిగిన ఎన్ఆర్ఐ తల్లిదండ్రుల సంఘ వార్షిక సమావేశములో ఆయన మాట్లాడారు ప్రాథమికంగా రెడ్ క్రాస్ సొసైటీతో పాటు దాతలు ఆరు కోట్ల రూపాయల సమకూరుస్తారని అనంతరము ఓ ఎన్ జి సి సంస్థ పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి విలువైన వైద్య పరికరాలు సమకూరుస్తుందని ఆయన వివరించారు సమావేశానికి అధ్యక్షత వహించిన ఎన్ఆర్ఐ తల్లిదండ్రుల సంఘం అధ్యక్షులు పాలడుగు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వై డి రామారావు తమ సంఘ ఉపాధ్యక్షులు కావటం గర్వకారణం అన్నారు మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా అతలాకుతలం చేస్తున్న క్యాన్సర్ నివారణకు కాకినాడలో మంచి ఆసుపత్రి రావడం సంతోషకరమన్నారు సంఘ కార్యదర్శి సిఎస్ఆర్ శర్మ నివేదిక సమర్పిస్తూ తమ సంఘములో 550 మందికిపైగా సభ్యులు ఉన్నారని సంఘం తరఫున పలు సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు సంఘములో కొత్తగా సభ్యులుగా చేరిన జేఎన్టీయూ వైస్ ఛాన్సులర్ సి ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడి సమాజానికి సేవలు అందించాలని సూచించారు.

–ఆరోగ్య సూత్రాలు...

ఈసమావేశంలో లక్ష్మీ ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యులు ఉమాశంకర్ ఇందిరా ప్రియదర్శిని సీనియర్ సిటిజెన్ల ఆరోగ్య సూత్రాలపై కీలక ఉపన్యాసాలు చేశారు మానసిక సమస్యలపై డాక్టర్ జనార్ధన్ వివరంగా మాట్లాడారు.సంఘ సభ్యుడు సత్యమూర్తి మాట్లాడుతూ కాకినాడ నగరానికి సిటీ ఆఫ్ హోప్ అనే ట్యాగ్ లైన్ ఇవ్వాలన్నారు.ఈ సమావేశ నిర్వహణకు సంఘ సహాయ కార్యదర్శి నరసింహ రావు కోశాధికారి రామనాథం సహకరించారు.సమావేశం జరుగుతున్నంతసేపు లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది ప్రాథమిక వైద్య పరీక్షలు సభ్యులకు నిర్వహించారు. కనకరాజు బాబు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

### ఎంబీ హాస్పిటల్, ఎ ఎస్ ఎల్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఈతకోట గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్ నందు ఆదివారం నాడు రావులపాలెంకు చెందిన ఎంబీ హాస్పిటల్ వారి ఎ ఎస్ ఎల్ మల్టీస్పెషలిస్ట్ హాస్పిటల్ వారు వైద్య శిబిరాన్ని నాగిరెడ్డి దుర్గారావు, వత్సవాయి బాబి రాజు, వెలుగట్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎమ్ సందీప్ రెడ్డి.డాక్టర్ ఎమ్ అనూష శిబిరంలో పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ బీపీ షుగర్ యూరిక్ యాసిడ్ రక్త పరీక్షలు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు డాక్టర్లు వారి టీం కలిసి అందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్య క్రమంలో పెద్దలు బోడపాటి రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మిరియాల రాము, బొరుసు సుబ్రమణ్యం ప్రజా ప్రతినిధులు. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మరో రెండు రోజులు భారీ వర్షాలు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరంలో కేంద్రీకృతమైన అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నందున వచ్చే 24 గంటల్లో బలపడి వాయుగుండంగా మారే అవకాశం.వచ్చే రెండు రోజులు కాకినాడ జిల్లా లో భారీ నుంచి అతిభారీ వర్షాలు ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి సూచించారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరిక జారీచేశారు.ప్రజలందరూ తమ ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని కాకినాడ జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలో భారీ వర్షాలు వచ్చే రెండు రోజులు కురిసే అవకాశం ఉన్నందున ఈనెల 18 వ తేదీ సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ను రద్దు చేయడం జరిగిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు . ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## ఏపీ స్పీకర్, ఐటీ మంత్రిలను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్పీ



**రాజమహేంద్రవరం, మేజర్న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి డా. నిమ్మల రామా నాయుడు గారి ఇంట జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ మరియు ఆర్టీజి శాఖల మంత్రివర్యులు నారా లోకేష్ తిరుగు ప్రయాణంలో ఆదివారం మధ్యాహ్నం మధురపూడి విమానాశ్రయానికి చేరుకు న్నారు.ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి.నరసింహ కిషోర్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ను విమానాశ్రయం లాంజ్లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు వారిని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. కలెక్టర్ వెంట ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్, డీఎస్పీ కే.రమేష్ బాబు, తదితర అధికారులు పాల్గొన్నారు. తదుపరి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు లు విమాన మార్గం ద్వారా హైదరాబాద్ వెళ్లడం జరిగింది.

# మార్వాడీలు దోపిడీదారులా? ఇక్కడికి ఎప్పుడు, ఎలా వచ్చారు..?



**కాకినాడ, మేజర్ న్యూస్ :** 'మార్వాడీ గో బ్యాక్'... ప్రస్తుతం తెలంగాణలో ట్రెండింగ్‌లో ఉంది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మార్వాడీలే వ్యాపారాలు చేసుకుంటున్నారని, స్థానికుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తూ నిరసనలు చేపట్టారు. మార్వాడీలపై వ్యతిరేకత ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ తాజాగా ఈ వివాదం తీవ్రమైంది. అందుకు కారణం లేకపోలేదు. పార్కింగ్ విషయమై ఓ యువకుడిపై
మార్వాడీలు దాడి చేయటం, గోరేటి రమేష్ అనే వ్యక్తి మార్వాడీల వ్యాపార ఆధిపత్యాన్ని, దోపిడిని విమర్శిస్తూ పాట పాడటంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఈ వివాదం కాస్తా ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుని మార్వాడీ గో బ్యాక్ ఉద్యమానికి దారితీసింది. ఈ సందర్భంగా అసలు మార్వాడీలు ఎవరు..? తెలంగాణలో ఎప్పటి నుండి ఉంటున్నారనే విషయాలను తెలుసుకుందాం.. సాధారణంగా చాలామందికి మార్వాడీ అనగానే మహారాష్ట్ర నుంచి వచ్చారని అనుకుంటారు. కానీ, నిజానికి మార్వాడీలు రాజస్థాన్ రాష్ట్రంలోని మార్వార్ ప్రాంతానికి చెందినవారు. జోథ్‌పూర్, బికనీర్, జైసల్మేర్, బార్మర్ వంటి ఎడారి చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించేవారు. అందుకే వీరిని మార్వాడీలుగా పిలుస్తారు. మారు (థార్ ఎడారి ప్రాంతం), వాడి (నివాసం) రెండు పదాల కలయిక నుంచి మార్వాడీ అనే పదం వచ్చింది. ఇక మార్వాడీల్లో ఎక్కువగా హిందువులే ఉంటారు. అయితే వారు జైన, హిందూ ఆచారాల ఆధారంగా ప్రత్యేకమైన జీవనశైలిని అనుసరిస్తారు. వీరి ఆచారాలలో కుటుంబ విలువలు, సమాజ సేవ, మతపరమైన కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. మార్వాడీలు దీపావళి, హోలీ, వినాయక చవితి వంటి పండుగలను ఘనంగా జరుపుకుంటారు. రాజస్థాన్‌లో వీరు నివసించే ప్రాంతంలో సారవంతమైన నేల లేకపోవడంతో వ్యవసాయం చాలా తక్కువగా ఉండేది. దీంతో ప్రధానంగా వ్యాపారంపై దృష్టి పెట్టారు. వీరు ఎక్కువగా వస్త్రాలు, బంగారం, ఆభరణాలు, ఫైనాన్స్ రంగాల్లో రాణిస్తున్నారు.

**-వ్యాపార రంగంలోకి మార్వాడీలు..** భారతదేశంలో వ్యాపార రంగ అభివృద్ధిలో మార్వాడీ పాత్ర కీలకమనే చెప్పాలి. సుమారు క్రీస్తు శకం 6 వ శతాబ్దం నుంచి మార్వాడీలకు వ్యాపార చరిత్ర ఉంది. అప్పట్లోనే రాజ్‌పుత్ రాజవంశాలకు చెందిన రాజులకు ఆర్థిక సలహాదారులుగా, వ్యాపారులుగా, రుణదాతలుగా సేవలందించారు. అయితే, 16 వ శతాబ్దంలో మొఘల్ పాలన కాలంలో మార్వాడీల వ్యాపారాలకు గుర్తింపు వచ్చింది. వారి కాలంలోనే రాజస్థాన్, గుజరాత్ నుంచి వారణాసి, ఢిల్లీ, కోల్‌కతా వంటి ప్రధాన నగరాల్లో వ్యాపార కేంద్రాలు స్థాపించి, తరువాత దేశవ్యాప్తంగా వ్యాపించారు. అనంతరం బ్రిటిష్ పాలనలో మార్వాడీలు ఆంగ్లేయులకు ఆర్థిక సేవలు అందించడం ద్వారా వారి వ్యాపారాలను మరింతగా విస్తరించుకున్నారు. ఈ క్రమంలోనే వారు బ్యాంకింగ్, బిల్ ఆఫ్ ఎక్స్ఛేంజ్ వంటి వ్యవస్థలను అభివృద్ధి చేశారు.

**-ఎక్కడికెళ్లినా వ్యాపారంలో ముందంజ..** ఇక ప్రస్తుతం ముంబై, కలకత్తా, చెన్నై, ఢిల్లీ, బెంగుళూరు, హైదరాబాద్ ఇలా దేశంలో ఏ నగరంలో చూసినా మార్వాడీలు లేని ప్రాంతం లేదు. వీరు ఎక్కడికి వెళ్ళినా వ్యాపారాల్లో ముందంజలో ఉంటారు. కష్టమర్లతో చక్కటి సంబంధాన్ని కొనసాగిస్తూ వ్యాపారాన్ని వృద్ధి చేయడంలో దిట్టలు.. అంతేకాదు, మనీ మేనేజ్‌మెంట్‌లో వీరిది ప్రత్యేక శైలి. మన దేశంలోని బిలియనీర్లలో 42 శాతం మంది మార్వాడీలే ఉన్నారు. బిర్లా కుటుంబం కూడా మార్వాడీ సమూహానికి చెందినదే. బిజినెస్ ఈజ్ ఏ వార్ అని ఆంగ్ల రచయిత మేరియా ప్యూజో చెప్పినట్లుగా... ఆ యుద్ధంలో గెలవడానికి కావలసిన అన్ని ఎత్తుజిత్తులు మార్వాడీల వద్ద పుష్కలంగా ఉన్నాయని చెప్పాలి. అలాగే, మార్వాడీ సముదాయం బలమైన సామాజిక బంధాలు, కుల సంఘాలు, వ్యాపార సంఘాల ద్వారా ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. ఇది వీరికి వ్యాపార విస్తరణలో గొప్ప ప్రయోజనాన్ని చేకూరుస్తుంది.

**-నిజాం పాలనలో వలస..** తెలంగాణలో మార్వాడీల ప్రయాణం 19 వ శతాబ్దంలో మొదలైంది. నిజాం పాలనలో హైదరాబాద్ ఒక వాణిజ్య కేంద్రంగా మారడంలతో, మార్వాడీలు వ్యాపార అవకాశాల కోసం ఇక్కడి వలస వచ్చారు. వారి వ్యాపార దృక్పథంతో నిజాం పాలన సమయంలోనే బంగారం, వస్త్రాలు, కిరాణా, ఆయిల్ మిల్లు వంటి రంగాల్లో ఆధిపత్యం సాధించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని బేగం బజార్, సుల్తాన్ బజార్, కిషన్ బాగ్ వంటి ప్రాంతాలను ఆధీనంలోకి తీసుకుని తమ వ్యాపార కేంద్రాలుగా మార్చుకున్నారు.

**-గో బ్యాక్ మార్వాడీ ఉద్యమం..** ఈ నేపథ్యంలో తెలంగాణాలో మార్వాడీల వ్యాపార ఆధిపత్యం కొంత వివాదాస్పదంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ చోట్ల మార్వాడీలే ఉంటున్నారని, తెలంగాణ ప్రజలకు వ్యాపారాలకు అవకాశం లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, మార్వాడీ వ్యాపారులు తమ వస్తువులను తక్కువ ధరలకు అమ్మడంం వల్ల స్థానిక వ్యాపారులకు గిరాకీ తగ్గుతోందని ఆరోపిస్తున్నారు. అంతేకాదు, వాచ్‌మెన్ దగ్గర నుంచి సర్వెంట్ల వరకు తమ వాళ్ళకి మాత్రమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుంటారు తప్పా స్థానికులకి ఉద్యోగాలు ఇవ్వరని మరో ఆరోపణ వీరిపై వినిపిస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే తమ మనుగడ కష్టమని ఆవేదనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో సికింద్రాబాద్‌లో ఓ యువకుడిపై పార్కింగ్ విషయంలో మార్వాడీలు దాడి చేశారు. దీంతో మార్వాడీలపై వ్యతిరేకత మళ్లీ తెరపైకి వచ్చింది. 'మార్వాడీ గో బ్యాక్ ' వంటి నినాదాలు సోషల్ మీడియాలో వినిపించాయి. అయితే, తాజాగా తెలంగాణాలో మార్వాడీల వ్యతిరేక ఉద్యమానికి రాజకీయ రంగు కూడా పులుముకున్నట్లుగా కనిపిస్తోంది. బీజేపి నేత, కేంద్రమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే రాజాసింగ్ మార్వాడీలకు మద్దతుగా నిలిచారు. మార్వాడీలను లక్ష్యంగా చేయడం కంటే, అక్రమ బంగ్లాదేశీలు, రోహింగ్యాలపై దృష్టి పెట్టాలని, ప్రతీ భారతీయుడికి దేశంలో ఎక్కడైనా వ్యాపారం చేసే రాజ్యాంగబద్ధమైన హక్కు ఉందని బీజేపి నేతలు అంటున్నారు. అలాగే , టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సైతం మార్వాడీలకు మద్దతుగా వారంతా మనలో ఒకరని, అలాంటి వారిని వెళ్లగొట్టే హక్కు ఎవరికి లేదని ఆయన స్పష్టం చేశారు. బీర్‌ఎస్ మాత్రం ఈ వివాదంపై ఇప్పటివరకు స్పందించలేదు. అయితే ఇదే తరహా మార్వాడీలపై వ్యతిరేక పరిణామాలు గతంలో చెన్నైలోనూ చోటుచేసుకున్నాయి కానీ, అక్కడ త్వరలోనే ఉద్యమం సద్దుమణిగింది. మరి తెలంగాణలో పరిస్థితి ఎలా మలుపుతీసుకుంటుందో వేచి చూడాలి.

**-పరిష్కారం అయ్యేది ఎలా..?..** కాగా, తెలంగాణలో మార్వాడీ వ్యాపారులు, స్థానిక సమాజం మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి, సామాజిక ఏకీకరణ, ఆర్థిక సమతుల్యత, సహకార వాతావరణం అవసరం. మార్వాడీలు స్థానిక సంస్కృతి, భాష, ఆచారాలను గౌరవించే విధంగా వ్యవహరించాలి. అలాగే, వారి వ్యాపారాలో స్థానికులకు ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహించవచ్చు. ఉదాహరణకు.. మార్వాడీలు నిర్వహించే దుకాణాలు, హోల్‌సేల్ వ్యాపారాలలో స్థానిక యువతకు ఉపాధి అవకాశం కల్పించడం ద్వారా స్థానికులలో విశ్వాసాన్ని పెంచవచ్చు. ఇక స్థానిక వ్యాపారులు ఆరోపిస్తున్నట్లుగా మార్వాడీలు తమ కమ్యూనిటీ వారికి తక్కువకు స్థానిక దుకాణదారులకు ఎక్కువ ధరలకు విక్రయించకుండా ధరలలో సమానత్వం, పోటీని ప్రోత్సహించే విధంగా న్యాయమైన వ్యాపార పద్ధతులను పాటించాలి. అలాగే, స్థానిక వ్యాపారులు కూడా వ్యాపార పోటీని సానుకూల దృక్పథంతో స్వీకరించాలి.

# గండేపల్లిలో ఉట్టి వేడుకలు

**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టివేడుకలు నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయం వద్ద ఉదయం నుండి పూజలు చేశారు. సాయంకాలం ఉట్టికొట్టు వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేడుకలను చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉట్టికొట్టు పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లంజపల్లి శ్రీనివాస్, ముంగర వెంకటేష్ ఉట్టి కొట్టి బహుమతిని సాధించాడు. ఈ కార్యక్రమంలో లంజపల్లి శ్రీనివాస్, (పండు), లంజపల్లి వీరబాబు కె. కృష్ణ, ముంగర విష్ణు, ముంగర రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 18 సోమవారం యథాతథంగా పీజీఆర్ఎస్ కార్యక్రమం

- **1100 కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదుల పరిష్కార వేదిక**
- **9552300009 వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందుబాటులో**
- **కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా నిర్వహించే పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార) కార్యక్రమం ఈ నెల ఆగస్టు 18 వ తేదీ సోమవారం యథావిధిగా నిర్వహించబడుతుందని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ శ్రీమతి పి. ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ అర్జీలను డివిజన్, మండల కేంద్రాల కార్యాలయాల్లోనే అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రానికి ప్రత్యేకంగా రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగా అధికారులు సేవలు అందిస్తారని, అందువల్ల ప్రజలకు సమయం మరియు ఖర్చు ఆదా అవుతుందని ఆమె తెలిపారు. అర్జీల స్వీకరణ ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జరుగుతుంది. ప్రజలు "మీ కోసం" 1100 కాల్ సెంటర్ ద్వారా కొత్త ఫిర్యాదులు నమోదు చేయడంతో పాటు, ఇప్పటికే నమోదు చేసిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని కూడా తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009 ద్వారా పౌర సేవలు పొందవచ్చని, ఈ నంబర్‌ను తమ సెల్‌ఫోన్లలో సేవ్ చేసుకోవాలని సూచించారు. నేరుగా హాజరు కాలేకపోయిన వారు meekosam.ap.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో అర్జీలు నమోదు చేసుకునే వీలుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ఈ వినూత్న మాధ్యమాలను ఉపయోగించి తమ సమస్య లను పరిష్కరించుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.

## డిప్యూటీ సీఎంచే సాస్ స్వచ్ఛంద సంస్థకు ఉత్తమ సేవ పురస్కారం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో ఉత్తమ స్వచ్ఛంద సేవా సంస్థగా సామర్లకోటకు చెందిన స్వరాజ్య అభ్యుదయ సేవా సమితి (సాస్) ఎంపికైంది. ఈ మేరకు శుక్రవారం కాకినాడలో 79 స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవ పురస్కారాన్ని సాస్ డైరెక్టర్ యాళ్ల పద్మలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, జిల్లా కలెక్టర్ ఎస్ షాన్మోహన్ చేతుల మీదుగా అందజేశారు. గత 26 సంవత్సరాలుగా బాలికలు , స్త్రీ శిశు సంక్షేమానికి, బాధితుల పక్షంగా, రైతుల సంక్షేమానికి స్వరాజ్య అభ్యుదయ సేవా సమితి చేస్తున్న సేవలు అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొనియాడారు. ఉత్తమ సేవా పురస్కారం పొందిన సాస్ డైరెక్టర్ యాళ్ల పద్మలతను పలువురు అభినందించారు.

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి-ఎస్సై రఘునాథరావు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు సూచించారు. ఆదివారం సాయంత్రం జగ్గంపేట పోలీస్ స్టేషన్లో ఎస్సై రఘునాథరావు స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.
మీరంతా సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, ఘర్షణలో పాల్గొన రాదని హెచ్చరించారు. రానున్న వినాయక చవితి పండుగలు ఎటువంటి అసాంఘిక, అల్లర్లకు దిగిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఘనంగా చింతూరు డివిజన్లో ఎపియూడబ్ల్యూజె ఆవిర్భావ దినోత్సవం

- జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం
- విలేకర్ల సమస్యల పరిష్కారానికి కృషి
- చింతూరు డివిజన్ అధ్యక్షులు ఎం.చంద్ర శేఖర్



**చింతూరు, మేజర్ న్యూస్ :** ఎపియూడబ్ల్యూజె రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు రేవిన్యూ డివిజన్లో కేంద్రంలో ఎపియూడబ్ల్యూజె చింతూరు డివిజన్ కమిటి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ 69 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చింతూరు డివిజన్ యునియాన్ అధ్యక్షులు మాసినేని చంద్ర శేఖర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.
ఈ వేడుకలో భాగంగా ముందుగా చింతూరు గాంధీ విగ్రహం వద్ద యునియన్ జెండా ఆవిష్కరణలో భాగంగా గాంధీజి విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం యూనియన్ అధ్యక్షులు జెండా ఆవిష్కరించారు. అనంతరం చింతూరు సెంటర్ నుండి ర్యాలీగా జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి, జిందాబాద్ జిందాబాద్ ఎపియూడబ్ల్యూజె వర్ధిల్లాలి అంటూ నినాదాలతో ఐక్యత చాటుకుంటూ చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఐటిడిఏ మీటింగ్ హాల్ నందు అవిర్భవ దినోత్సవ సమావేశం ఏర్పాటు చేసి డివిజన్ లోని అనారోగ్య కారణాల వలన మృతి చెందిన ఎపియూడబ్ల్యూజె సభ్యులకు రెండు నిమిషాలు పాటు నివాళులు అర్పించారు. అదేవిధంగా చింతూరు, కూనవరం, వి ఆర్ పురం,ఎట పాక మండలాలకు చెందిన 8 మంది సినియర్ పత్రిక విలేఖర్లకు శాలువాతో సత్కరించి మెమొంటూలను ప్రశంస పత్రాలను బహుకరించారు. కార్యక్రమాలు మరియు సమావేశం నకు హాజరైన నాలుగు మండలాల మీడియా మిత్రులకు మెమంటోలను బహుకరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీనియర్ జర్నలిస్టులతో పాటు జర్నలిస్టు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.
ఈ ఆవిర్భవ దినోత్సవాన్ని ఉద్దేశించి జర్నలిస్టుల సంక్షేమం అభివృద్ధి అభ్యున్నతి ధ్యేయంగా ఎపియూడబ్ల్యూజె పనిచేస్తుందని అన్నారు. చింతూరు మన్యంలో కొందరు జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేయడం తో పాటు ఇంకొందరి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. ఏజెన్సీ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు కోసం కృషి చేయడం జరుగుతుందని అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ ఇప్పించడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. రాబోయే కాలంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంనకు ఎపియూడబ్ల్యూజె సభ్యులకు పుస్తకాలు పెన్నులు మెమోంటోలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎపియూడబ్ల్యూజె డివిజన్ రాష్ట్ర కార్యదర్శి పరిటాల వెంకట్, కోశాధికారి టి.రమేష్ విశ్వనాథ్, సంయుక్త కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఎపియూడబ్ల్యూజె సభ్యులు రియజ్, ఫిరోజ్, వి.సతీష్ సీనియర్ పాత్రికేయులు సి హెచ్.విజయ్ కుమార్, ఎం.డి సౌకత్, ఎం. సత్తిబాబు, బి.నాగేశ్వరరావు,బి. నరేష్ కె.బాబురావు, డి.వెంకట రమణ, వి వి ఎస్ టి . శ్రీనివాస్ పి. మోహనరావు, ఎలక్ట్రానిక్ మీడియా రామకృష్ణ, శ్రీనివాస్, నవీన్, వినయ్ ప్రసాద్, జీవన్ నాలుగు మండలాల ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

# వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
## జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్



**చింతూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి, శబరి పొంగి ప్రవహించే ప్రమాదం ఉందని, వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలకు తెలియ జేశారు. ఈ కాన్ఫరెన్స్లో చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ అధికారులతో మాట్లాడుతూ తాసిల్దార్ కార్యాలయాలలో ఫ్లడ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సెప్టెంబర్ నెల కు సంబంధించిన పిడిఎఫ్ బియ్యం రేషన్ దుకాణాలకు తరలించినట్టు తెలియజేశారు. ఇప్పటివరకు 440 గర్భిణీ స్త్రీల ను గుర్తించడం జరిగిందన్నారు.
ఇప్పటికే ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు శాశ్వతంగా జనరేటర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వరదల సమయంలో కావాల్సిన అత్యవసర మందులు తెప్పించడం జరిగిందని అన్నారు. వరదల సమయంలో ఫ్లడ్ రిలీఫ్ సెంటర్స్‌లో బయో టాయిలెట్స్ ఏర్పాటు కొరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలియజేశారు. వరదల సమయంలో కావలసిన అడ్వాన్స్ స్టాక్ బియ్యంను స్టాక్ పాయింట్ నందు నిల్వ ఉంచడం జరిగిందని అన్నారు. వరదల సమయంలో అత్యవసర సేవలు కొరకు91 9701026397 చింతూరు ఐటిడిఏ వాట్సాప్ నెంబర్‌కు సంప్రదించవచ్చని తెలియజేశారు

# పోలవరం నిర్వాసితుల పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు



**కూనవరం, మేజర్ న్యూస్ :** పోలవరం నిర్వాసితుల పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, ఈ సమస్యలను జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లను ఉన్నామని సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎం ఏ బేబీ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజులు పాదయాత్ర ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా వి ఆర్ పురం మండలం రామవరం లో బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక నాయకులు పులి బుజ్జి అధ్యక్షత వహించారు.
కార్యక్రమంలో భాగంగా సిపిఎం బృందానికి స్థానిక మహిళలు హారతులతో ఆహ్వానం పలికారు. పూలమాలతో ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎంపి బేబీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వేల కోట్లతో రాజధాని నిర్మించేందుకు ప్రణాళికల రూపొందిస్తున్నారని, అటువంటి ప్రయత్నాలకు మేము వ్యతిరేకం కాదని అయితే పోలవరం నిర్వాసితుల సమస్యలను ఎందుకు పరిష్కరించరు అని ప్రశ్నించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని తెలుగుదేశం, గత వైసిపి ప్రభుత్వం మూడు ప్రభుత్వాలు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యే అన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పోలవరం నిర్వాసితులకు గౌరవప్రదమైన జీవితం కల్పించేందుకు, మెరుగైన మౌలిక వసతులతో కూడిన కాలనీలో నిర్మించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితిలో పూర్తి భిన్నంగా ఉన్నాయని వివరించారు. గడిచిన రెండు రోజులు పర్యటనలు పలు కాలనీ సందర్శించి పోలవరం నిర్వాసితులతో మాట్లాడామని ఎక్కడ చూసినా నాసిరకం నిర్మాణాలే దర్శనమిచ్చాయన్నారు. నిర్మాణాలు పూర్తి చేసి మూడు నాలుగు ఏళ్ళు గడవక ముందే స్లాబులు నుంచి వర్షం నీరు కారణంతో బరకాలు కట్టుకుని ప్రజలు కాపురాలు ఉంటున్నారని తెలిపారు. అటువంటి గృహాలు గుడిసెలు తలపిస్తున్నాయని మండిపడ్డారు.
జాతీయ ప్రాజెక్టు పోలవరం నిర్మాణానికి 55 వేల కోట్లతో డిపిఆర్ రూపొందించగా కేంద్ర ప్రభుత్వం కేవలం 2200 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, ఆ విడుదల చేసిన నిధులలో గత ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు పునరావాసానికి కేవలం 7000 కోట్లు మాత్రమే ఖర్చు చేసేయ్ అన్నారు. ఈ ఖర్చు చేసే నిధులలోను అత్యధిక భాగం రాజకీయ పెద్దలు, అధికారులు, కాంట్రాక్టర్లు కొమ్మక్కొయ్యి లూటీ చేసినట్లు స్పష్టమవుతుందని అన్నారు. తక్షణమే దీనిపై విచారణ జరిపి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.
అప్పటివరకు కనీసం ఉపాధి పనులైన అన్ని గ్రామాల్లో కల్పించాలని కోరారు. అదేవిధంగా పోలవరం, ఇతర పనులలో నిర్వాసితుల కుటుంబాలకి ఉద్యోగం కల్పించాలని అన్నారు. అనంతరం స్థానిక ప్రజలు తమ సమస్యలను ప్రస్తావిస్తూ వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాసు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో రామకృష్ణ మిషన్ ఉచిత వైద్య సేవలు

- రోగులకు వారి సహాయకులకు అన్నదానం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గిరిజన ప్రాంతంలో రామకృష్ణ మిషన్ ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ విజ్ఞప్తి చేశారు. రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ వైద్యశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియచేసారు. ఈ వైద్య శిబిరంలో రామకృష్ణ మఠం మలేషియా అధ్యక్షులు స్వామి సుప్రియ నందజీ మహారాజ్, రామకృష్ణ మిషన్ క్యాంపు ఇన్చార్జి స్వామి లోకమయ నందజీ మహారాజ్ పాల్గొని వైద్య శిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు.
ఈ వైద్య శిబిరంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ దాసరి ఉమమహేష్, డాక్టర్ సంపత్ కుమార్ పాల్గొని సుమారు 150మందికి వైద్య సేవలు అందించినట్టు స్వామిజీ తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన వారిలో అవసరమైన 42 మందికి రక్తపరీక్షలు, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, 9మందికి ఫిజియోథెరపీ, ముగ్గురికి ఇ.సి.జి లు చేసినట్టు స్వామిజీ తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామిజీ కోరారు. ఈ వైద్య శిబిరంలో వాలంటీర్లు దాసరి పెద్ద అప్పారావు, నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించినట్టు స్వామిజీ తెలిపారు.